క్లుప్తంగా

పీఎంజేఏవై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వీరులపాడు: పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన(పీఎంజేఏవై)కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి సూచించారు. మండలంలోని పెద్దాపురం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పీఎంజేఏవై కార్డులను సోమవారం ఆమె అందజేశారు. ముందుగా ప్రధానమంత్రి జనారోగ్య యోజనా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్డులు కలిగిన పేదలకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.ఐదు లక్షల వరకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచి నిప్పులపల్లి శాంతమ్మ, ఉపసర్పంచి బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



మక్కపేట(వత్సవాయి): మక్కపేటలో చేపట్టిన శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను దేవాదాయ ధర్మాదాయశాఖకు చెందిన ఏఈ వి.కుమార్ సోమవారం పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా పనులు త్వరితగతిన పూర్తిచేసి అప్పగించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు, గ్రామస్తులు కనగాల రమేష్, అర్చకులు అత్తలూరి యుగంధర్‌శర్మ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పెనుగంచిప్రోలు: స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద పెనుగంచిప్రోలు మండల డెమొక్రటిక్ పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఎంఈవో డి.రవీంద్ర సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎంఈవో రవీంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ, బాల మేధావి అవార్డులు, ఉత్తమ ఎన్‌రోల్‌మెంట్ అవార్డులతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రోత్సహించడంలో పీఆర్‌టీయూ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ముక్కా సత్యనారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి మర్రి ప్రభాకర్, మండల ప్రధానకార్యదర్శి రాములునాయక్, జిల్లా నాయకులు వేగినేటి వెంకటరమణ, సీహెచ్ రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



లింగాలపాడు గ్రామస్తులకు సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమ పాలన సాగిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడులో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. అంతే కాకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటంతోపాటు గ్రామాల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నికల ముందు కనిపించే ప్రజాప్రతినిధులు ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడంతోపాటు వాటిని సత్వరమే పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం కూడా ప్రతి గ్రామసచివాలయానికి రూ.20లక్షలు కేటాయించినట్లు చెప్పారు.

ఘనవిజయాన్ని అందించాలి..

ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి రానున్న ఎన్నికలలో ఘనవిజయాన్ని అందించాలని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు కోరారు. పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీకి ప్రజలంతా అండగా ఉండి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లినేని శ్రీనివాసరావు, పారుపల్లి హరిబాబు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, సూరా కృష్ణ, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామసచివాలయం ఆర్బీకే ప్రారంభం...



వెలది కొత్తపాలెంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

చందర్లపాడు(నందిగామ టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెం గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.18లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు సాధ్యంకాని రీతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజల ఇళ్ల ముంగిటకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలు కరోనా సమయంలో ఎటువంటి సేవలందించాయో ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సాగు మెలకువలతో పాటు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందిస్తున్న ఏకైక ప్రభుత్వమని తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని చెప్పారు. రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి ఖర్చులకు సైతం ఆర్థిక సహకారం అందిస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయాన్ని పండుగ చేసేలా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడేటి నాగ మల్లేశ్వరి, జడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచ్ చింతోటి శ్రీలత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్‌ఎన్ ప్రసాద్, రాయల జానకిరామయ్య, శాఖమూరు వెంకటకుమారి, ములకలపల్లి వెంకటకుమారి, చింతోటి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

నాయకుడే.. పారిశుధ్య కార్మికుడై

పేటలో పారిశుధ్య పనులకు పూనుకున్న విప్ ఉదయభాను



పేటలో రోడ్డును శుభ్రం చేస్తున్న విప్ సామినేని ఉదయభాను, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మెను విరమించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో జగ్గయ్యపేట పట్టణంలోని విలియంపేట, బంగారుకొట్ల సెంటర్, పాత కూరగాయల మార్కెట్, కన్యాకుమారి పాన్‌షాపు కూడలి తదితర ప్రాంతాల్లో విపరీతంగా పేరుకుపోయిన చెత్తచెదారాలను సోమవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి తొలగించారు. ఈ సందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల జీతాలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.18వేల నుంచి రూ 21 వేలకు పెంచారని గుర్తుచేశారు. వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు. మున్సిపల్ కార్మికులు ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే సమ్మెను విరమించాలని కోరారు. కరోనా కష్టకాలంలో వారు చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్మికుల న్యాయమైన కోరికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నందున ట్రేడ్ యూనియన్ల వారు కూడా సమ్మె విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమ్మె కారణంగా పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉండటంతో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఉదయభాను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ యువజన నాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పార్టీ మహిళ, ఎస్టీ, వాణిజ్య విభాగాల అధ్యక్షులు ముసిని రాజ్యలక్ష్మి, బద్దూనాయక్, చారుగుండ్ల కొండ, పార్టీ నాయకులు సాధుపాటి రాజు, కాశీకిషోర్, జాన్‌బాషా, మోరె వినోద్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పీర్లచావిడి పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న విప్ ఉదయభాను, కమిటీ సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లో శిథిలావస్థకు చేరిన బుజ్జిగారి పీర్ల చావిడిని రూ.15లక్షల వ్యయంతో పునర్నిర్మిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. పీర్లచావిడి పునర్నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ పీర్లచావిడి శిథిలావస్థకు చేరిన వైనాన్ని కమిటీ సభ్యులు తనదృష్టికి తీసుకురావడంతో పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, నాయకులు గుంజ లక్ష్మణ్, పీర్లచావిడి కమిటీ సభ్యులు షేక్ జానీ, షేక్ సాయి, పూసపాటి పెదవెంకన్న, రాజు, దుర్గారావు, కొండ అనిల్, మారేపల్లి శాంతిబాబు, ఉప్పెల్లి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్ష శిబిరం సందర్శన

సమ్మెను విరమించాలని చైర్మన్ విజ్ఞప్తి



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న చైర్మన్ రాఘవేంద్ర, ప్రభాకర్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపట్టిన మున్సిపల్ కార్మికుల శిబిరాన్ని చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ సోమవారం సందర్శించి కార్మికులతో మాట్లాడారు. పట్టణ ప్రజల ఆరోగ్యంతోపాటు పండుగల దృష్ట్యా రద్దీ ఎక్కువగా ఉంటున్నందున సమ్మెను విరమించి విధుల్లోకి చేరాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని వారికి హామీ ఇచ్చారు. ఉదయభాను ఆదేశాల మేరకు కార్మికులను కలసినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్మికులకు అండగా ఉండే ప్రభుత్వమని సమ్మెను విరమించాలని వారిని కోరారు. చైర్మన్ వెంట మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు, కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేంద్ర, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ ఉన్నారు.

అన్నదానానికి రూ.8వేలు విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన కొల్లా ధర్మకుమార్ రూ.8వేలు విరాళంగా ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



జయంతి(వీరులపాడు): విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని జయంతి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు సోమవారం ఆమె ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ పేదల బతుకులు మారాలన్నా, కుటుంబం..సమాజం బాగుపడాలన్నా చదువుతోనే సాధ్యమన్నారు. పాఠశాల స్థాయిలోనే డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి నిరుపేద విద్యార్థులు సైతం భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న ట్యాబులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, నాయకులు ఇప్పల కృష్ణారెడ్డి, మారపాక శ్రీనివాసరావు, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి సీఎం జగన్ కృషి



ఆధునీకరించిన నందిగామ పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: సహకార సంఘాల బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. కేడీసీసీ బ్యాంకు నిధులు రూ.తొమ్మిది లక్షలతో ఆధునికీరించిన నందిగామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో కన్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సహకార సంఘాలు మరింత బలోపేతమయ్యాయన్నారు. ఐదేళ్ల కిందట నందిగామ పీఏసీఎస్ టర్నోవర్ రూ.10కోట్లు ఉండగా, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.19కోట్లకు చేరడమే ఇందుకు నిదర్శమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యల కారణంగా అప్పుల్లో ఉన్న సహకారం సంఘాలు లాభాల బాట పట్టాయని వివరించారు. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా కేడీసీసీ బ్యాంకు రైతులు, డ్వాక్రాసంఘాల వారికి పెద్దమొత్తంలో రుణాలు అందిస్తోందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావును సొసైటీ చైర్మన్ పాములపాటి రమేష్, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నల్లమల్లి మురళి, మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, చల్లా బ్రహ్మేశ్వరరావు, గాడిపర్తి శివాజీ, చిరుమామిళ్ల చైతన్యకుమార్, కరిముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా మిర్చి కోతలు



కల్లంలో ఆరబోసిన మిర్చి

వత్సవాయి : మండలంలో మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సీజన్‌లో రైతులు మిర్చి సాగును 10వేల ఎకరాల్లో చేపట్టారు. మిర్చి పంటకు మొదట్లో వైరస్ సోకినప్పటికీ రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకున్నారు. వత్సవాయి, పోలంపల్లి, కంభంపాడు, మక్కపేట, భీమవరం, గోపినేనిపాలెం, ఇందుగపల్లి, మంగొల్లు తదితర గ్రామాల్లో ప్రస్తుతం మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎకరాకి 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. మిర్చి క్వింటా ధర కూడా ప్రస్తుతం మార్కెట్లో 12 వేల నుంచి 15 వేల వరకు పలుకుతోంది. అయితే కాయ పండిన సమయంలో పడిన అకాల వర్షాలకు తాలుకాయ అవుతుందని కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈకోతలో తాలుకాయ ఎక్కువగా ఉందని, రైతులు వివరించారు. ఎకరాకి ఈ ఏడాది రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు.

పాఠశాలల్లో జన్ భగీదరి కార్యక్రమం



తిరుమలగిరి పాఠశాలలో...

తిరుమలగిరి(జగ్గయ్యపేట): సామాజిక న్యాయం మహాశిల్పం పేరుతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సోమవారం జన్ భగీదరి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాదబాబు మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడ స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. ధర్మవరప్పాడుతండాలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనిగండ్లపాడులో...



అనిగండ్లపాడులో ముగ్గుతో అంబేడ్కర్ చిత్రాన్ని వేసిన విద్యార్థులతో హెచ్‌ఎం రాము

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక ప్రాథమిక పాఠశాలలో సోమవారం జన్ భగీదరి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అంబేడ్కర్ చిత్రపటాన్ని ముగ్గులతో తీర్చిదిద్దారు. అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు శెట్టిపోగు రాము అభినందించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దక్షిణ భారత టీటీ పోటీలకు పీబీ సిద్ధార్థ విద్యార్థులు



విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాలకు టేబుల్ టెన్నిస్ పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టులో తమ కళాశాల విద్యార్థులు కె.చరణ్‌తేజ, బి.వి.మల్లికార్జున రోహిత్, ఎ.గోవింద్ ఎంపికైనట్లు పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ వ్యాయామ అధ్యాపకులు ఎ.చినబాబు తెలిపారు. విజయవాడలోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఇటీవల జరిగిన కృష్ణా వర్సిటీ అంతర కళాశాలల పోటీల్లో తమ కాలేజీ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. పోటీల అనంతరం జరిగిన వర్సిటీ జట్టు ఎంపికలో ముగ్గురు విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించినట్లు తెలిపారు. ఫిబ్రవరి ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు తమిళనాడులోని అంబేడ్కర్ లా యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత పోటీల్లో జట్టు పాల్గొంటుందన్నారు. కాలేజీ ప్రాంగణంలో క్రీడాకారులను సోమవారం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల అభినందించారు.

పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు



గండ్రాయిలో హరిదాసు వేషధారణలో పాఠశాల హెచ్‌ఎం రమేష్‌బాబు, పక్కన టీచర్లు



ధర్మవరప్పాడుతండలో గాలిపటాలు ఎగరవేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ముగ్గులు తీర్చిదిద్దుతున్న చందాపురం పాఠశాల విద్యార్థులు

జగ్గయ్యపేట: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు, పాలపొంగళ్లు, హరిదాసు వేషధారణ, భోగి మంటలు, గంగిరెద్దుల వేషధారణ, భోగిపళ్లు, గాలిపటాలు ఎగరవేయడం తదితర కార్యక్రమాలతో పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గండ్రాయి మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ పాఠశాలలో సర్పంచ్ కొత్తపల్లి లూర్దుమేరి సంక్రాంతి సంబరాలను ప్రారంభించగా, పాఠశాల హెచ్‌ఎం నేలవెల్లి రమేష్‌బాబు హరిదాసు వేషధారణలో ప్రత్యేకాకర్షణగా నిలిచారు. ధర్మవరప్పాడు తండా ప్రాథమిక పాఠశాలలో భోగి మంటలు వేసి గాలిపటాలు ఎగరవేశారు. తిరుమలగిరిలో నిర్వహించిన సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ దారావత్ దావుడియా, ఉపాధ్యాయులు మంగతాయారమ్మ, లక్ష్మణరావు, సుజాత, పల్లవి, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని విజ్ఞాన్ విద్యాసంస్థలో స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వాదించారు.ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మహమ్మద్‌బాషా, విజయ్, నజీర్, దాసు, రాము, లాలీ, కిరణ్, పద్మ జన్, విద్యార్థులు పాల్గొన్నారు. లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్‌లో జరిగిన వేడుకలను స్కూల్ పాలకవర్గ ఉపాధ్యక్షులు మేజర్ సత్యనారాయణ, కార్యదర్శి బదరీనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రా రంభించారు. భోగి మంటలు, కోడి పందేలు, గంగిరెద్దుల ఆట, ముగ్గుల పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ కేటీ ఆచార్యులు, పీఈటీ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీవివాన్ గ్లోబల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చెరుకు గడ, బెల్లం, భోగిపళ్లతో నింపిన కుండలను చిన్నారులకు ఇచ్చి ప్రిన్సిపాల్ కీర్తి, ఉపాధ్యాయులు ఆశీర్వాదించారు.

వైభవంగా సంబరాలు...

నందిగామ: నందిగామలోని ఆయా పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గులు వేశారు. విద్యార్థులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. చందాపురంలోని ఎంపీ యూపీ పాఠశాలలో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పెద్దవరం జెడ్పీపాఠశాలలో ముగ్గులు, సాంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించారు.ఆయా పోటీల విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. శ్రీ చైతన్య పాఠశాలలో పాలపొంగళ్లు పొంగించారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు.



నందిగామ శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులను ఆశీర్వదిస్తున్న ఉపాధ్యాయులు



పేట శ్రీవివాన్ స్కూల్‌లో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



పేట విజ్ఞాన్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పేట లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు